కాంగ్రెస్ అవిశ్వాసానికి బీఆర్ఎస్ చెక్

మెజార్టీ కౌన్సిలర్ల మద్దతు తమకే ఉందని కలెక్టర్‌కు లేఖను అందిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, తదితరులు

- జమ్మికుంట మున్సిపల్‌లో ముదురుతున్న రాజకీయం
- 23 మంది కౌన్సిలర్లతో కలెక్టర్ వద్దకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి
- కౌన్సిలర్ పొనగంటి మల్లయ్యకు విప్ జారీ
- ఆయన పదవి పోవడం ఖాయమన్న కౌశిక్
- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీపై ఎమ్మెల్యే ఫైర్
- జమ్మికుంట తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని కలెక్టర్‌కు వినతి

కరీంనగర్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): జమ్మికుంట మున్సిపల్ రాజకీయం ముదిరి పాకాన పడుతున్నది. అధికార కాంగ్రెస్ అండచూసుకుని స్థానిక మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావుపై కొందరు కౌన్సిలర్లు శుక్రవారం అవిశ్వాస నోటీసు ఇవ్వగా, దానికి బీఆర్ఎస్ చెక్ పెట్టింది. శనివారం వైస్ చైర్మన్ దేశిని స్వప్న సహా 23 మంది కౌన్సిలర్లను వెంట తీసుకుని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కలెక్టర్ పమేలా సత్పతిని కలిశారు. మెజార్టీ కౌన్సిలర్లు తమ వెంటే ఉన్నారని, చైర్మన్ రాజేశ్వర్ రావుకు మద్దతుగా నిలుస్తున్నారని వారి సంతకాలతో కూడిన లేఖను అందిస్తూ, ఆయనపై ఇచ్చిన అవిశ్వాసం నోటీసును తిరస్కరించాలని ఎమ్మెల్యే స్వయంగా కలెక్టర్‌ను కోరారు. అధికార కాంగ్రెస్ బలం చూసుకుని తమ పార్టీ నుంచే గెలిచిన కొందరు తమకే వెన్ను పోటు పొడవాలని చూస్తున్నారని, ఇందుకు కారకుడైన కౌన్సిలర్ పొనగంటి మల్లయ్యకు విప్ జారీ చేస్తున్నామని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కౌశిక్ వెల్లడించారు.

కలెక్టర్‌ను కలిసిన కౌన్సిలర్లు

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై శుక్రవారం స్థానిక కౌన్సిలర్లు 16 మంది అవిశ్వాస తీర్మానం అందించారు. అయితే శనివారం అవిశ్వాస డ్రామా మరో మలుపు తిరిగింది. తమకే 23 మంది మద్దతు ఉన్నదని, వారి సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు స్వయంగా కరీంనగర్‌కు వచ్చారు. కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి 23 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన లేఖను అందించారు. తమకు సంపూర్ణ మద్దతు ఉన్నందున చైర్మన్, వైస్ చైర్ పర్సన్‌పై ఇచ్చిన అవిశ్వాస నోటీసును పరిగణనలోకి తీసుకోవద్దని ఎమ్మెల్యే, చైర్మన్ కలిసి కలెక్టర్‌కు విన్నవించారు.

పొనగంటి మల్లయ్యకు విప్ జారీ

పార్టీ పిరాయించిన జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు కౌన్సిలర్ పొనగంటి మల్లయ్యపై అనర్హత వేటు వేయాలని, ఇందుకు తమ పార్టీ విప్ జారీ చేసిందని చైర్మన్ రాజేశ్వర్ రావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ బీఫాంపై కౌన్సిలర్‌గా గెలిచిన మల్లయ్య, గత అసెంబ్లీ ఎన్నికల్లో నవంబర్ 23న జమ్మికుంటలో ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయాన్ని పరిగణలోకి తీసుకుని ఆయనపై అనర్హత వేటు వేయాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు.

ప్రజా పాలన అంటే ఇదేనా..?

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసును తిరస్కరించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం కరీంనగర్‌లో కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి, చాలా సేపు చర్చించారు. తన నియోజకవర్గంలో తనకు తెలియకుండా, స్థానిక సర్పంచులు, కౌన్సిలర్లకు సమచారం లేకుండా కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన జమ్మికుంట తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజా పాలన అంటే ఇదేనా..? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసేందుకు తాము ప్రయత్నించామని, అయితే సమావేశాలు నిర్వహించి ఇస్తామని చెప్పిన అధికారులు అర్ధరాత్రి ఎవరికీ తెలియకుండా లబ్ధిదారులను పిలిపించుకుని ఎలా పంపిణీ చేశారని ప్రశ్నించారు. అధికారులు తమను కమీషన్ అడిగారని కొందరు లబ్ధిదారులు తమతో చెప్పుకొన్నారని, ఈ పరిణామాలు చూస్తుంటే అధికారులు కమీషన్లు వసూలు చేసి జిల్లా మంత్రులకు ఇస్తున్నట్లు అనుమానం ఉన్నదని ఆరోపించారు. జమ్మికుంట అవిశ్వాస విషయాన్ని ప్రస్తావిస్తూ తమకు 23 మంది కౌన్సిలర్ల మద్దతు ఉన్నదని, కొందరు కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని తిరస్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. పార్టీ పిరాయించిన పొనగంటి మల్లయ్యకు విప్ జారీ చేశామని, ఆయన కౌన్సిలర్ పదవి ఊడి పోతుందని స్పష్టం చేశారు. రైతులు సాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో సమయానికి నీళ్లు, రైతుబంధు, సరైన కరెంట్ అందించి రైతులను ఆదుకున్నామని అన్నారు. రైతు భరోసా కింద ఇస్తామన్న రూ.15వేలు ఏమైనాయని ప్రశ్నించారు. సాగు నీరు, పెట్టుబడి సాయం అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులు పెడుతున్నదని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ధ్వజమెత్తారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు మాట్లాడుతూ మెజార్టీ కౌన్సిలర్ల మద్దతు తనకే ఉందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుడు బండ శ్రీనివాస్, కేడీసీసీబీ వైస్ చైర్మన్ పింగళి రమేశ్, ఎంపీపీలు మమత–ప్రసాద్, రేణుక–తిరుపతిరెడ్డి, పావని–వెంకటేశ్, రాణి–సురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్, నాయకులు రంజిత్, సత్యనారాయణ రావు, ఇంద్రసేనా రెడ్డి, 23 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పిల్లలూ.. బాగా చదువుకోండి

సీవోఈలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

అల్గునూర్‌లోని సీవోఈ పాఠశాలను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం సందర్శించారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడారు. సైన్స్‌కు సంబంధించిన ప్రశ్నలు వేయగా, పిల్లలు సమాధానం చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలను ఆప్యాయంగా పలుకరిస్తూ బాగా చదువుకోవాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. -తిమ్మాపూర్, డిసెంబర్30

ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి

మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, డిప్యూటీ మేయర్

కార్పొరేషన్, డిసెంబర్ 30: అభయ హస్తం పథకం దరఖాస్తుల నమోదులో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. నగరంలోని 37వ డివిజన్‌లో శనివారం ఆమె దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్రాల వద్ద వృద్ధులు, మహిళల కోసం ప్రత్యేక కౌంటర్లు, టెంటు, కుర్చీలు, ఇతర వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి–హరిశంకర్, మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, బల్దియా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా 'ప్రజాపాలన' సందడి

కార్పొరేషన్/వీణవంక/ హుజూరాబాద్ టౌన్/ రూరల్/ ఇల్లందకుంట/ సైదాపూర్/ గంగాధర/ శంకరపట్నం/ గన్నేరువరం/ చొప్పదండి/కరీంనగర్‌రూరల్, డిసెంబర్ 30: జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమం శనివారం మూడో రోజు కొనసాగింది. వార్డు, గ్రామసభలతో నగరంతో పాటు ఊరూరా దరఖాస్తుదారులతో సందడి నెలకొన్నది. కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకాగా, అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా చోట్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఉన్నతాధికారులు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు.

ప్రజలకు చేరువయ్యేందుకే..

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 30: ప్రజలకు చేరువయ్యేందుకే ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని 8వ డివిజన్ (అల్గునూర్)లో శనివారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పారు. దరఖాస్తుల ఫారాలకు డబ్బులు వసూలు చేయవద్దని చెప్పారు. అనంతరం స్థానిక హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సల్ల శారద– రవీందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

హుజూరాబాద్ టౌన్/జమ్మికుంట, డిసెంబర్30: ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీఎంఏ సయ్యద్ మసూద్(వరంగల్) సూచించారు. శనివారం హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ప్రజా పాలన కార్యక్రమాలను వేర్వేరుగా సందర్శించారు. ప్రజా పాలన ప్రత్యేకాధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం అధికారులు జమ్మికుంట మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్ పరిస్థితులను సమీక్షించారు. ఆయా కార్యక్రమాల్లో హుజూరాబాద్ ఆర్డీవో రాజు, ప్రజా పాలన కార్యక్రమ ప్రత్యేకాధికారి పద్మావతి, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్‌చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ బీ శ్రీనివాస్, ఆర్ఐ వాణి, మేనేజర్ భూపాల్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సైదాపూర్, డిసెంబర్30: ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణాంజనేయ, అధ్యాపకులు, తదితరులున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో న్యూ ఇయర్ వేడుకలకు అనుమతి లేదు

రాంనగర్, డిసెంబర్ 30: జిల్లాలో న్యూ ఇయర్ వేడుకలను బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించుకునేందుకు అనుమతి లేదని, ప్రజలు ఇండ్లల్లోనే ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పోలీస్ శాఖ స్పష్టం చేసింది. వేడుకల పేరిట నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ క్రమంలో ఈనెల 31న కమిషనరేట్ వ్యాప్తంగా ఆంక్షలు అమలులో ఉండనున్నాయి. చెక్ పోస్టులు, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, స్పెషల్ యాక్షన్ టీంలు ఆదివారం సాయంత్రం నుంచే రంగంలోకి దిగనున్నాయి. న్యూ ఇయర్ వేడుకల పేరిట రోడ్లపైకి వచ్చి హంగామా చేసే వారిని నియంత్రించేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని సీపీ ఇప్పటికే ప్రకటించారు. అలాగే, ఆదివారం సాయంత్రం 6 నుంచి సోమవారం ఉదయం 5 గంటల వరకు కరీంనగర్ శివారులోని తీగల వంతెన, డ్యాం కట్టపైకి వెళ్లేందుకు అనుమతి లేదని సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. వాహనదారులు ఇతర మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

కిట్స్‌లో ఫ్రెషర్స్ డే హంగామా

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 30: సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సివిల్, మెకానికల్, ఈసీఈ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో హంగామా చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్, ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, వివిధ బ్రాంచీల విభాగాధిపతులు రాజేశ్వరరావు, సతీశ్, రమేశ్, రిజిస్ట్రార్ వెంకటయ్యతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు శిక్షణ

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 30: మంకమ్మతోటలోని శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో అధ్యాపకులకు శనివారం శిక్షణ శిబిరం నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్య వక్తగా శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ హాజరై 'ఎంగేజ్ టూ ఎంపవర్–స్ట్రాటజీస్ ఫర్ డైనమిక్ క్లాస్ రూం' అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చట్టబద్ధ దత్తత శ్రేయస్కరం

కలెక్టరేట్, డిసెంబర్ 30: చట్టబద్ధంగా దత్తత తీసుకోవడమే శ్రేయస్కరమని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని శిశుగృహంలోని నాలుగు నెలల చిన్నారిని హైదరాబాద్‌కు చెందిన పిల్లలు లేని దంపతులకు శనివారం దత్తత ఇచ్చారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ద్వారా మాత్రమే దత్తత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో శాంత, ఐసీడీఎస్ సిబ్బంది తిరుపతి, రాజేశ్, రాజ్‌కుమార్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ నాయకుల హర్షం

కలెక్టరేట్, డిసెంబర్ 30: అఖిల భారత ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడిగా టీఎన్జీవోల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ఎన్నిక కావడంపై సంఘం జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు శనివారం జగదీశ్వర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా బాధ్యులు రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్‌సింగ్, మారుపాక రాజేశ్ భరద్వాజ్, బాస పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంపు

కలెక్టరేట్, డిసెంబర్ 30: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరు కోసం జనవరి 31 వరకు దరఖాస్తు గడువు పెంచినట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు నతానియేల్ తెలిపారు. జిల్లాలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగ, మైనార్టీ విద్యార్థులు వెబ్‌సైట్ https//telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణచౌక్, డిసెంబర్ 30: నగరంలోని నేత బజార్‌లో జిల్లా పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు గుడిమల్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం, వాసాల రమేశ్, దూడం మల్లేశం ఆవిష్కరించారు. పద్మశాలీ సంఘం నాయకులు గడ్డం శ్రీరాములు, తిరుపతి, అల్స భద్రయ్య, వేణుగోపాల్, నర్సయ్య పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి బీ ప్రతిమ

కోర్టుచౌరస్తా, డిసెంబర్ 30: లోక్ అదాలత్‌తో కేసులు సత్వరమే పరిష్కారమవుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి బీ ప్రతిమ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన లోక్‌అదాలత్ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఇరు వర్గాల వారు రాజీమార్గం ద్వారా లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే డబ్బు, సమయం వృథా కాకుండా ఉంటుందని తెలిపారు. త్వరలోనే గ్రామాల్లో, పట్టణాల్లో న్యాయ చైతన్య సదస్సులు నిర్వహించి లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేసిన కక్షిదారులకు, పోలీస్ సిబ్బందికి, న్యాయవాదులకు, బీమా కంపెనీల వారికి జడ్జి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు మాట్లాడుతూ, లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ముందుకు రావాలని కోరారు. అడిషనల్ డీసీపీ రాజు మాట్లాడుతూ, రాజీ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ మంచి మార్గమని, దీనికి పోలీస్ సిబ్బంది సహకారం ఉంటుందని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి వెంకటేశ్, న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు, పోలీసు సిబ్బంది, కక్షదారులు తదితరులు పాల్గొన్నారు. కాగా, లోక్ అదాలత్‌లో 2741 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. వీటిలో క్రిమినల్ కేసులు 2,661, సివిల్ కేసులు 15, మోటారు ప్రమాద పరిహారం కేసులు 65 పరిష్కరించారు. ఇందులో బాధితులకు రూ. 3 కోట్ల 14 లక్షల 85 వేలు పరిహారంగా ఇన్సూరెన్స్ కంపెనీలు ముందుకు రాగా ఆయా కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ట్రాఫిక్ చలాన కేసులు, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్, ఇతర కేసులు 99 వేల 25 పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

ప్రాణం పోసిన అడ్వాన్స్‌డ్ డయాలసిస్

విద్యానగర్, డిసెంబర్ 30: కంటిన్యూవస్ రెనల్ రిప్లేస్‌మెంట్ థెరపీ (సీఆర్ఆర్‌టీ)తో ఓ యువకుడి ప్రాణాలు కాపాడినట్లు కరీంనగర్ మెడికవర్ దవాఖాన నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్ తెలిపారు. దవాఖానలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానకొండూర్ మండలం లింగాపూర్‌కు చెందిన తాళ్ల మహేశ్ అనే యువకుడు కడుపు నొప్పి, వాంతులతో పాటు మూత్ర విసర్జణ తగ్గి నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేరాడు. అప్పటికే వెంటిలేటర్ అమర్చగా, పరిస్థితి విషమించడంతో మెడికవర్ దవాఖానకు తీసుకువచ్చారు. దవాఖానలో వైద్య పరీక్షలు నిర్వహించగా మల్టీఆర్గాన్ డిస్ ఫంక్షన్‌గా తేలిందన్నారు. నెక్రోటైజింగ్ ప్రాంకియాటైటిస్ సమస్యతో పాటు కిడ్నీలు ఫెయిల్యూర్, లివర్ సమస్య, ఊపిరితిత్తుల్లో నీరు నిండడం, లోబీపీ వంటివి బయటపడ్డాయన్నారు. లోబీపీ ఉన్నప్పుడు నార్మల్ డయాలసిస్ చేస్తే ప్రాణం పోయే అవకాశం ఉండడంతో ప్రత్యామ్నాయంగా సీఆర్ఆర్‌టీ 36 గంటల పాటు నిర్విరామంగా చేశామన్నారు. నార్మల్ డయాలసిస్ రక్తాన్ని మాత్రమే శుద్ధిచేస్తే, సీఆర్ఆర్‌టీతో శరీరంలో పేరుకుపోయిన విషపదార్థాలన్నింటినీ తీసివేయడం సాధ్యపడుతుందన్నారు. ఇలా చేయడంతో రెండు రోజులకే వెంటిలేటర్ నుంచి పేషెంట్ బయటకు వచ్చాడని, బీపీ నార్మల్‌కు వచ్చి మల్టీ ఆర్గాన్ డిస్ ఫంక్షన్ నుంచి రికవరీ అయినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌కే పరిమితమైన ఈ చికిత్స ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కేవలం మెడికవర్‌లో మాత్రమే అందుబాటులో ఉందన్నారు. కాగా, మెడికవర్ వైద్య బృందానికి మహేశ్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో దవాఖాన సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, దవాఖాన మెడికల్ సూపరింటెండెంట్ రవిమల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల ఖర్చులపై సమీక్ష

కలెక్టరేట్, డిసెంబర్ 30: నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో వచ్చే పార్లమెంటు ఎన్నికల ఖర్చులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ శనివారం జిల్లాస్థాయి రేట్ ఫిక్సేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల్లో ఉపయోగించే ప్రచార సామగ్రి, ఫ్లెక్సీలు, వాహనాలు, బహిరంగ సభ వేదికలకు ఉపయోగించే టెంట్లు, మైక్‌సెట్లు, తదితరాలకు మార్కెట్ ప్రకారం చేసే ఖర్చుపై చర్చించారు. ఉపయోగించే సామగ్రిని బట్టి ఖర్చులపై నిర్ణయం తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తెలిపారు. డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, డీసీవో రామానుజాచారి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు స్థాన చలనం

రాంనగర్, డిసెంబర్ 30: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కరీంనగర్ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, టూటౌన్ రామచంద్రరావు, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డిని బదిలీ చేస్తూ మల్టీజోన్ ఐజీకి రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. ఈ ముగ్గురి సేవలు కరీంనగర్ కమిషనరేట్‌కు అవసరం లేదని సీపీ అభిషేక్ మహంతి ఐజీకి సరెండర్ చేశారు. వీరి స్థానంలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా సరిలాల్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రస్తుతం ఎస్‌బీలో పనిచేస్తున్న వెంకటేశ్‌కు పోస్టింగ్ కల్పించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లోనూ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న వంశీకృష్ణ వీణవంకకు, స్పెషల్ బ్రాంచ్ లో పని చేస్తున్న చేరాలు ఎల్ఎండీకి, కరీంనగర్ త్రీ టౌన్ లో పనిచేస్తున్న రమేశ్ రామడుగు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న ప్రమోద్ రెడ్డి, తిరుపతి, ఆసిఫ్ అహ్మద్‌ను వీఆర్‌లో ఉంచారు.

పోస్ట్ మాస్టర్‌గా జానకీదేవి సేవలు అమూల్యం

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్30: తపాలా శాఖలో పోస్ట్ మాస్టర్‌గా వేముగంటి జానకీదేవి ప్రజలకు అందించిన సేవలు అమూల్యమైనవని కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బీ వినోద్‌కుమార్ కొనియాడారు. బోర్నపల్లి గ్రామ పోస్ట్ మాస్టర్ వేముగంటి జానకీదేవి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. వేముగంటి జానకీదేవీరవీందర్‌రావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యూ మహేందర్, కేసీ క్యాంపు సబ్ పోస్ట్ మాస్టర్ సీహెచ్ గోపీకిషన్, ఉప్పల్ సబ్ పోస్ట్ మాస్టర్ ఎం రవి, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 30: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జే వెంకటేశ్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయం (ముకుందలాల్ మిశ్రా భవనం)లో శనివారం నిర్వహించిన సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి దేశంలో మతాల మధ్య చిచ్చులు పెడుతూ రాజకీయ లబ్ధి పొందుతున్నదన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, నగర కార్యదర్శి సత్యం, సీఐటీయూ కార్యదర్శి రమేశ్, ఐద్వా కార్యదర్శి నాగమణి పాల్గొన్నారు.

ఫండస్ పాఠశాల వార్షికోత్సవం